సాక్షి హనుమకొండ

శుక్రవారం । 2 । మే । 2025



ఎదుర్కోలు ఉత్సవం

భద్రకాళి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో



కోర్టు ఆదేశాలు బేఖాతర్

టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో హైకోర్టు తీర్పులను యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందని కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మన్లు ఆరోపిస్తున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టెక్నికల్ టీచర్ల శిక్షణను వినియోగించుకోవాలి



విద్యారణ్యపురి: టెక్నికల్ టీచర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణను అభ్యర్థులు వినియోగించుకోవాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి కోరారు. గురువారం హనుమకొండ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, మ్యూజిక్‌లో 42రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సర్టిఫికెట్ కోర్సులో చేరినవారు వందశాతం నైపుణ్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జ్ వెంకటరమణారెడ్డి, బి.సంధ్యారాణి, కోఆర్డినేటర్ బి.రమేష్, ఎండీ నయీంపాష, ఎంఈఓ జి.నెహ్రూ, హెచ్‌ఎం జగన్నాథం పాల్గొన్నారు.

జావెలిన్ త్రోలో ప్రేమ్ కుమార్‌కు బంగారు పతకం



హన్మకొండ: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ పోటీల్లో భీమదేవరపల్లి ఈఆర్‌ఓలో ఏఏఓగా పనిచేస్తున్న ఇ.ప్రేమ్ కుమార్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. గురువారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రేమ్ కుమార్‌ను ఎస్‌ఈ పి.మధుసూదన్ రావు, డీఈ (టెక్నికల్) విజేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు యాకూబ్ పాషా, సునీల్ కుమార్ అభినందించారు.

కేడీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రజనీలత

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రజనీలత బాధ్యతలు నిర్వర్తించనున్నారు. బుధవారం ప్రిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రజనీలతకు చార్జిని అప్పగించారు. అధికారికంగా కళాశాల విద్యాకమిషనర్ త్వరలోనే కేడీసీ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా రజనీలతను నియమించనున్నట్లు తెలిసింది.

ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.రామచంద్రం కొద్దిరోజులపాటు ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఇప్పటివరకు పనిచేసిన తోట రాజయ్య బుధవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కొత్త వ్యక్తిని నియమించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం యూనివర్సిటీలో డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎవరైనా డిప్యూటీ రిజిస్ట్రార్ ఉంటే ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించేవారు. దీంతో ప్రస్తుతానికి వి.రామచంద్రానికి ఫైనాన్స్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు.

హైడ్రా డీఎస్పీగా తిరుమల్ బదిలీ

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధి కాజీపేట సబ్ డివిజన్ ఏసీపీగా పనిచేస్తున్న పి.తిరుమల్‌ను హైడ్రా డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ డాక్టర్ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల్‌కు సుదీర్ఘంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసిన అనుభవం, సమర్థవంతమైన అధికారిగా పేరుంది.

మీ సమస్యలు మా దృష్టికి తీసుకురండి



నయీంనగర్: కార్మికులు వారి సమస్యలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ క్షమాదేశ్ పాండే కార్మికులకు తెలిపారు. మే డే సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్ బజార్, మర్కజీ స్కూల్ వద్ద జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ అసోసియేషన్ సహకారంతో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో క్షమాదేశ్ పాండే పాల్గొని, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొక్కుల కృష్ణయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఫలితమిచ్చిన ప్రత్యేక తరగతులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఈసారి పదోతరగతి ఫలితాలు విద్యాశాఖ అధికారులకు ఊరటనిచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే స్వల్ప ఉత్తీర్ణత పెరిగింది. మొదటినుంచి ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేయడంతో ఈసారి కొంత మెరుగైన ఫలితాలు వచ్చాయని అధికారులు భావిస్తున్నారు. గత ఏడాది 93.10శాతం ఉతీర్ణత సాధిస్తే ఈ ఏడాది 93.65శాతం నమోదైంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చే ఏడాది ఇంకా మంచి ఫలితాలు తీసుకువస్తామని చెబుతున్నారు. కాగా, ఈ ఏడాది ఎక్కువగా గణితంలో ఫెయిలైనట్లు సమాచారం.





జిల్లాలో పది తరగతి ఫలితాల్లో గత ఏడాదికంటే స్వల్పంగా ఉత్తీర్ణత పెరుగుదల

- ఫలితమిచ్చిన 45 రోజుల ప్రత్యేక ప్రణాళిక
- టీఎస్ఆర్ఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్ ఈఐఎస్‌లో వందశాతం..
- ఇదే ఒరవడి కొనసాగిస్తామంటున్న విద్యాశాఖ అధికారులు
- గత ఏడాదికంటే తగ్గిన వందశాతం ఉత్తీర్ణత స్కూళ్ల సంఖ్య

- ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు 712మంది పరీక్షలకు హాజరుకాగా 627మంది(88.06శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 84.17శాతం అంటే సుమారు 4.11శాతం ఉత్తీర్ణత పెరిగింది.
- జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో 1,837మందికిగాను 1,656మంది (90.15శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 91.38శాతం ఉత్తీర్ణత సాధించారు. స్వల్పంగా తగ్గింది.
- ఎయిడెడ్ స్కూల్స్‌లో 158మందికిగాను 152 మంది ఉత్తీర్ణత (96.20శాతం)సాధించారు.గత ఏడాది 98.25శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు శాతం ఉత్తీర్ణత తగ్గింది.
- టీఎస్ఆర్ఈఐఎస్ స్కూల్స్‌లో 210మంది కిగాను 210 మంది ఉత్తీర్ణత (100శాతం)సాధించారు. గత ఏడాది కూడా 100శాతం ఉత్తీర్ణత సాధించారు.
- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)756మందికిగాను 745మంది (98.54శాతం) సాధించారు. గత ఏడాది 97.87శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసారి స్వల్పంగా పెరిగింది.
- టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ 79మందికిగాను 79 మంది (100శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించారు.
- బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో 610మందికిగాను 606 మంది ఉత్తీర్ణత (99.34శాతం), గత ఏడాది 99.20శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది స్వల్పంగా పెరిగింది.

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు..

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీరోజు ఉదయం గంట, సాయంత్రం మరో గంటపాటు ప్రత్యేక తరగతులు సబ్జెక్టు ఉపాధ్యాయులతో విద్యాబోధన చేశారు. 45 రోజుల పాటు వివిధ సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి డీసీఈబీ ద్వారా హెచ్‌ఎంలకు అందజేశారు. ప్రతీ సబ్జెక్టు టీచర్ స్లిప్‌టెస్టులు నిర్వహించి వెనకబడిన విద్యార్థులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి విద్యాబోధన చేశారు. విద్యార్థులకు పరీక్షకు కొంతకాలం ముందు సాయంత్రం వేళ స్నాక్స్ అందజేశారు. లష్కరబాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో అయితే వారాంతపు పరీక్షలు, నెలవారీ పరీక్షలు స్లిప్ టెస్టులు నిర్వహించారు. మర్కజీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు ఉదయం తెల్లవారుజామునే వేకప్‌కాల్ చేసి చదువుకోవాలని సూచించేవారు. గురుకుల, కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లలో అయితే ప్రతీరోజుస్టడీ అవర్లతోపాటు స్లిప్‌టెస్టులు నిర్వహించారు. దీంతో ఎక్కువశాతం ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో మెరుగైన ఫలితాలు వచ్చాయి.

- మైనారిటీ గురుకులాల్లో గత ఏడాది 96.13శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 257మందికిగాను 250 (97.28శాతం) పాసయ్యారు. ఈసారి పెరిగింది.
- ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 73మందికిగాను 66మంది 90.41శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 70.59శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాదితో పోలిస్తే 20శాతం వరకు పెరిగింది.

కేజీబీవీ, మోడల్‌స్కూళ్లలోనూ...

జిల్లాలోని కేజీబీవీల్లో 373 మంది విద్యార్థినులకు 352మంది ఉత్తీర్ణత(94.37శాతం) సాధించారు. గత ఏడాది 94.99శాతం ఉత్తీర్ణత కాగా, ఈసారి స్వల్పంగా పెరిగింది. మోడల్ స్కూళ్లలో 247మందికి 232మంది విద్యార్థులు ఉత్తీర్ణత (93.93శాతం) సాధించారు.గత ఏడాది 92.78శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకశాతానికి పైగాపెరిగింది.

తగ్గిన వందశాతం ఉత్తీర్ణత పాఠశాలలు..

ఈ ఏడాది ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని హైస్కూళ్లు 168 ఉండగా, అందులో 57 పాఠశాలల వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. గత ఏడాది 65పాఠశాలలకుగాను 65 స్కూళ్లు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తంగా పాస్ రిజల్ట్ పెరిగినా వందశాతం ఉత్తీర్ణత స్కూళ్లు గత ఏడాదికంటే తగ్గడం గమనార్హం.

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ఇలా..

	ఈ ఏడాది	గత ఏడాది
పాఠశాలలు	168	165
హాజరైన వారు	5,312	5,539
ఉత్తీర్ణులు	4,975	5,157
ఫెయిల్	337	382

పరీక్షలకు సంసిద్ధతపై ప్రత్యేక దృష్టితోనే..



హనుమకొండ జిల్లాకు డీఈఓగా గత ఏడాది అగస్టులో వచ్చా. రాగానే టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టితో సంసిద్ధత చేపట్టాం. 45 రోజుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఈసారి మండల స్థాయిలో సబ్జెక్టు నిపుణలతో ప్రాధాన్యత గల ప్రశ్నావళిపై, పరీక్ష రాసే విధానం లాంటి అంశాలపై అవగాహన కల్పించాం. రిసోర్స్‌పర్సన్‌లతో సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహించడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు భావిస్తున్నాం.

- డీఈఓ వాసంతి

లక్ష్యం సాధించారు..

- నలుగురు సివిల్ జడ్జిలుగా ఎంపిక
- ఇటీవల ఫలితాలు ప్రకటించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం
- ఎంపికైనవారిలో ముగ్గురు మహిళా న్యాయవాదులు, ఒక న్యాయశాఖ ఉద్యోగి

వరంగల్ లీగల్: న్యాయశాస్త్ర పట్టా పొందిన వారు న్యాయవాదిగానే ఉండకుండా జడ్జి కావాలన్న వారి లక్ష్యం నెరవేరింది. ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష ఫలితాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన ముగ్గురు మహిళా న్యాయవాదులు, ఒక న్యాయశాఖ ఉద్యోగి మెరుగైన ప్రతిభ కనబర్చి జడ్జిలుగా ఎంపికయ్యారు. వారిలో వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన గంగిశెట్టి ప్రసీద, కమలాపూర్‌కు చెందిన లడే మేఘన, నర్సంపేటకు చెందిన అంబటి ప్రణయ, వరంగల్ జిల్లా ఫ్యామిలీ కోర్ట్ టైపిస్ట్ లడే రాజు ఉన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల కోటాలో..



లడే రాజు

హనుమకొండ జిల్లా కమలపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లడే వినోద, మోహన్ రావు దంపతుల కుమారుడైన లడే రాజు న్యాయశాఖ ఉద్యోగిగా కరీంనగర్ జిల్లాలో నియామకమై ప్రస్తుతం వరంగల్ ఫ్యామిలీకోర్ట్ టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2007లో ఎల్‌బీబీ చేసి, 2010 ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసిన రాజు న్యాయశాఖ ఉద్యోగుల కోటాలో ఎంపికైన ఏకైక అభ్యర్థిగా నిలిచారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, భార్య పిల్లల సహకారంన్యాయమూర్తుల సలహాలు, సూచనలతో విజయం సాధించినట్లు రాజు తెలిపారు.

2023లో న్యాయ శాస్త్రం పట్టా...



మేఘన

వరంగల్ దర్గా కాజీపేటకు చెందిన దారా మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. మేఘన తల్లి అరుణకుమారి ఎల్ఐసీ ఆఫీసర్‌గా.. తండ్రి బాలకృష్ణ నల్సార్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023 న్యాయ శాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుంది. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది.

న్యాయవాది నుంచి జడ్జిగా..



ప్రసీద

వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన గంగిశెట్టి హరినాథ్, పరిపూర్ణ దంపతుల కుమార్తె ప్రసీద 2022లో హనుమకొండ ఆదర్శ లా కాలేజీలో చదివి న్యాయశాస్త్ర పట్టా పొందారు. నాటినుంచి జిల్లా కోర్టులో సీని యర్ న్యాయవాది కే.వీ.కే గుప్త, గువ్వల సాంబరా జు సహకారంతో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ జడ్జిగా విజయం సాధించారు. ప్రసీద మాట్లాడుతూ లక్ష్య సాధనకు ప్రణాళిక ఎంత అవసరమో.. నిబద్ధత కలిగిన కార్యాచరణ సైతం అంతే ముఖ్య మన్నారు. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో జూనియర్ జడ్జిగా ఎంపికైనట్లు తెలిపారు.

మొదటి ప్రయత్నంలోనే..



ప్రణయ

వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అంబటి వెంకన్న, విజయ దంపతుల కుమార్తె అంబటి ప్రణయ కాకతీయ యూనివర్సిటీనుంచి న్యాయ శాస్త్ర పట్టభద్రురాలై 2023 డిసెంబర్ 30న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఎంఫార్మసీ సైతం పూర్తి చేశారు. ఆమె భర్త లవణ్‌కుమార్ ప్రస్తుతం కాజీపేటపోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. తన భర్త లవణ్‌కుమార్ సహకారం, సీనియర్ న్యాయవాది సమీప బంధువు పూస శ్రీనివాస్ ప్రోత్సాహంతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించినట్లు ప్రణయ తెలిపారు.

147 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు వెల్లడి

వరంగల్ క్రైం: గంజాయి అక్రమ రవాణాపై వరంగల్ నార్కోటిక్స్ విభాగం అధికారులు ఉక్కుపాదం మోపినట్లు నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ సైదులు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చింతగట్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర నార్కోటిక్ పోలీసులు రూ.73.65 లక్షల విలువ గల 147 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుకుమామిడి ప్రాంతంనుంచి నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సదయ్య, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన సామల శేషు కలిసి ఇన్నోవా, షిఫ్ట్ కార్లలో 69 ప్యాకెట్ల గంజాయిని తరలిస్తూ పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు సదయ్య, సతీష్‌లపై 2014, 2016లో కేయూసీ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సైలు శ్రీకాంత్, రాజు, మొగిళి,సిబ్బంది రంగయ్య, సోమలింగం, విజయ్, రాజేష్, శ్రీను, రహీమ్, సంపత్, రాజు, సతీష్‌లు పాల్గొన్నారు.

కార్మికులకు విశ్రాంతి భవనం నిర్మిస్తాం..

- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో హమాలీ కార్మికులకు విశ్రాంతి భవనం నిర్మిస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. కూరగాయల మార్కెట్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన మే డే వేడుకల్లో గురువారం ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులకు 8 గంటల పనిదినం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన వారి స్ఫూర్తితో మేడే జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, యూనియన్ గౌరవ అధ్యక్షుడు బోగి సురేశ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డి, నాయకులు గోపాల నవీన్‌రాజ్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్లు జారతి రమేష్, వేణుగోపాల్, నాయకులు మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, వర్తక సంఘం నాయకులు జారతి శ్రీనివాస్, బేతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ప్రభుత్వ సంస్థల భవనాలకు భూములు గుర్తించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: ప్రభుత్వ సంస్థల కార్యాలయాలకు అవసరమైన సర్కారు భూములు గుర్తించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. అధికారులకు సూచించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ, కుడా, ఆర్అండ్‌బీ, స్కిల్ డెవలప్మెంట్, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ఏర్పాటు, కాజీపేట బస్టాండ్, కాజీపేట దర్గా ఆర్వోబీ, తదితర అభివృద్ధి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ సంస్థల భవనాలకు అనువైన భూములను గుర్తించాలని, వాటి సర్వే రిపోర్ట్‌ను అందజేయాలన్నారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, కుడా పీఓ అజిత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

పోరాటాల ఫలితంగానే హక్కులు

- సదస్సులో నిట్‌ప్రొఫెసర్ రమ

విద్యారణ్యపురి : నాడు అనేక దేశాల్లో పోరాటాల ఫలితంగానే కార్మికులు హక్కులు సాధించుకోగలగారని ఆయా హక్కులను పరిరక్షించుకునేందుకు కూడా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందని వరంగల్ నిట్ ప్రొఫెసర్ వలుపదాసు రమ పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండలో సీపీఐ కార్యాలయంలో బూర భిక్షపతి అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. సదస్సులో ఆమెపాల్గొని మాట్లాడారు. తొలుత కవిసమ్మేళనం నిర్వహించగా, పలువురు కవితలు వినిపించారు.

గౌరవెల్లి కాలువకు భూ సేకరణ పూర్తిచేయండి

- గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలి
- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ: గౌరవెల్లి ప్రాజెక్టు కాలువకు జిల్లా పరిధిలోని వేలేరు, భీమదేవరపల్లి మండలాల్లో భూసేకరణ ప్రక్రియను మే చివరి నాటికల్లా పూర్తి చేయాలని ఆర్డీఓ రమేష్ రాథోడ్, అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ సేకరణ, రైతులకు పరిహారం చెల్లింపు, జాతీయ రహదారుల నిర్మాణ పనుల పూర్తిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భాగంగా భూములు కోల్పోతున్న పరకాల, దామెర, శాయంపేట, ఆత్మకూర్ మండలాల పరిధిలోని గ్రామాల నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆర్డీఓ నారాయణను ఆదేశించారు. ఫీల్డ్ పనులను త్వరగా పూర్తిచేయాలని జాతీయ రహదారుల శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, మేనేజర్ సంపత్ రావు, తహసీల్దార్లు విజయలక్ష్మి, జ్యోతి, వరలక్ష్మి దేవి, జగన్మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలకు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలి

జిల్లాలోని ప్రతీ గ్రామం, ఆవాసాలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని, ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రాజీవ్ యువ వికాసంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖలవారీగా ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల అద్దె ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోనూ తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, క్లోరినేషన్ సరిగ్గా జరిగేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్ చేయాలన్నారు. బేస్‌మెంట్ దశకు వచ్చిన లబ్ధిదారులకు బిల్లు చెల్లింపు కోసం ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను శుక్రవారం అందించాలన్నారు. లబ్ధిదారుల వివరాలను అందజేస్తే వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక జాబితా ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తి కావాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ రవీందర్, డీపీఓ లక్ష్మి రమాకాంత్, మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి మురళీధర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీలత, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

నీట్ పరీక్షకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లు, నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పోలీస్, విద్య, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, పోస్టల్, తదితర శాఖల అధికారులకు నిర్వహణ, ఏర్పాట్లు, భద్రత, తదితర అంశాలను వివరించారు. ఈ నెల 4న జరిగే నీట్ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4680 మంది అభ్యర్థులు రాయనున్నారని వివరించారు.



గౌరవెల్లి ప్రాజెక్టుపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ముందస్తు పన్నుల చెల్లింపునకు రిబేటు

వరంగల్: బల్దియా పరిధిలోని ముందస్తు ఆస్తిపన్నుల చెల్లింపులు చేసేవారికి 5శాతం రిబేటును ప్రభుత్వం ఈనెల 7వ తేదీ వరకు పొడిగించింది. ముందుస్తుగా 2025–26వరకు ఆస్తి పన్నులు చెల్లింపులు చేసేవారికి ఏప్రిల్ 30వ తేదీ చివరి గడువుగా ఉంది. ఈగడువును వారం రోజుల పాటు పెంచుతూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని బల్దియా అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కాజీపేట నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు

● మే, జూన్‌లో నడిపించనున్న రైల్వే..



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ నుంచి తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రానికి ప్రయాణికులు, భక్తుల కోసం వేసవిని పురస్కరించుకొని ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

కాజీపేట–తిరుపతి (07253) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24వ తేదీల్లో కాజీపేట నుంచి 13:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 09:40 గంటలకు చేరుతుంది. అదేవిధంగా తిరుపతి–కాజీపేట (07254)వెళ్లే ఎక్స్‌ప్రెస్ మే 6, 13, 20, 27, జూన్ 4, 11, 18, 25వ తేదీల్లో ప్రతి బుధవారం తిరుపతిలో 12:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు కాజీపేటకు 08:00 గంటలకు చేరుతుంది. ఈ సర్వీస్‌లకు జనగామ, భువనగిరి, చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, సేడెమ్, సులేహాలి వెస్ట్, యాద్గిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గూటి, తాడిపత్రి, కడప, రాజ్‌పేట, కోడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ అవకాశం కల్పించారు.

కేయూలో యథావిధిగా హాస్టల్స్, మెస్‌లు

కేయూ క్యాంపస్: అలుమనాక్ ప్రకారం కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులకు మే 1 నుంచి అధికారులు సెలవులు ప్రకటించారు. అయితే పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు మాత్రం తమకు పోటీ పరీక్షలున్నాయని యథావిధిగా హాస్టళ్లు, మెస్‌లను కొనసాగించాలని ఇటీవల ఆందోళన చేశారు. దీంతో హాస్టల్స్, మెస్‌లను యథావిధిగా కొనసాగిస్తున్నారు. గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులతో అకాడమిక్ కమిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం హాస్టళ్లు, మెస్‌లను కొనసాగిస్తున్నందున వారికి నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెలలో నిర్వహించాలనే అంశం చర్చకు వచ్చిందని సమాచారం. కానీ, జూన్ 6వ తేదీ నుంచి పీజీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు టైంటేబుల్ ప్రకటించారు. ఈనెల 2న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి వచ్చాక సమావేశం నిర్వహించి తుదినిర్ణయం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. సెలవులు ఇచ్చినప్పటికీ హాస్టల్, మెస్ సదుపాయం కల్పించాలని సుమారు 149మంది పీజీ కోర్సుల ఫస్టియర్ విద్యార్థులు సంబంధిత అధికారులను కోరారు. వారికి కూడా అవకాశం ఇచ్చినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, లా కళాశాల విద్యార్థుల హాస్టళ్ల మెస్‌లను మూసివేసినట్లు డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా బీఈ డీ, ఎంఈడీ కోర్సుల విద్యార్థులకు హాస్టళ్లలో, మెస్ సదుపాయం యథావిధిగా కొనసాగనుంది.

సమ్మక్కసాగర్ @ డెడ్ స్టోరేజ్

జలాశయానికి తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- బ్యారేజీలో తేలిన ఇసుక మేటలు
- ముమ్మందు తప్పని నీటి కష్టాలు
- ఇన్‌టెక్ వెల్ నుంచి ఒక మోటారు ద్వారా పంపింగ్



నీరులేకపోవడంతో ఇసుక మేటలతో ఉన్న సమ్మక్క బ్యారేజీ ప్రాంతం

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దేవాదుల ఇన్‌టెక్ వెల్ పంపింగ్‌కు జీవనాధారంగా పిలువబడే జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండడంతో పంపింగ్‌కు అంతరాయం ఏర్పతుందనే చర్చ సాగుతుంది. పంపింగ్ నిలిచిపోతే దేవాదులకు దిగువన ఉన్న భీమ్‌ఘనపూర్, గొల్లబుద్ధారం వంటి రిజర్వాయర్లకు నీటి కష్టాలు తప్పవనే సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుతం సాగు నీటి అవసరం తగ్గినా.. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు ముందుచూపుతో బ్యారేజీలో నీటిని నిల్వ ఉంచకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తగ్గిన నీటి నిల్వలు..

సమ్మక్క సాగర్ బ్యారేజీ జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గి డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.76 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. బ్యారేజీ పూర్తి నీటి మట్టం 83 మీటర్లు కాగా ప్రస్తుతం 72.30మీటర్లు ఉన్నాయి. బ్యారేజీలోకి ఎగువ నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది. బ్యారేజీలోని 59 గేట్లలో 58 గేట్లను క్లోజ్ చేసి ఒక గేటు నుంచి 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గత కొంత కాలంగా పూర్తి గేట్లను మూసి నిల్వ చేసిన నీటిని దిగువ ప్రాంతాల తాగు నీటి అవసరాల నిమిత్తం వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు.

దిగువ ప్రాంతాలకు తప్పని తిప్పలు..

దేవాదుల ఇన్‌టెక్ వెల్‌కు దిగువన ఉన్న గొల్ల బుద్ధారం, భీమ్ ఘనపూర్, మొదలగు జలాశయాలకు నీటి ఇబ్బందులు తప్పేలా లేవు. దేవాదుల పంపింగ్ నిలిచిపోతే దిగువన ఉన్న జలాశయాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అదే జరిగితే ఆ జలాశయాల నీటిపై తాగు నీటికి ఆధారపడే ప్రాంతాలకు నీటి అవసరాలు తీర్చడానికి అధికారుల వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు కనబడడం లేదు.

నిలిచిపోనున్న దేవాదుల పంపింగ్..

తుపాకులగూడెం గ్రామ పంచాయతీలోని గుట్టల గంగారం గ్రామ పరిధిలోని దేవాదుల ఎత్తిపోతల పంపింగ్ కొద్ది రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే పరిస్థితికి నెలకొంది. ఇన్‌ఫ్లో లేకపోవడంతో గోదావరిలో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. దేవాదుల వద్ద 71.00మీటర్ల నీటి మట్టం వరకు పంపింగ్ చేసే అవకాశం ఉండగా.. ప్రస్తుతం 71.75మీటర్లు మాత్రమే ఉన్నాయి. దేవాదుల వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా.. ఏప్రిల్‌లో 5,6 మోటార్ల ద్వారా పంపింగ్ చేసిన అధికారులు నీటి నిల్వలు తగ్గడంతో ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. వీటితోపాటు సమ్మక్క బ్యారేజీలోని ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అంటే రోజులో 547 క్యూసెక్కుల నీరు గోదావరిలో తగ్గిపోతుంది. కానీ, ఎగువ నుంచి బ్యారేజీలోకి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది.

ఎగువ నుంచి నీరు రావడం లేదు



గోదావరిలోకి ఎగువ నుంచి నీరు రాకపోవడంతో బ్యారేజీలో నీరు తగ్గిపోతుంది. దేవాదుల వద్ద పంపింగ్‌కు సరిపడా నీరు అందకపోవడంతో ప్రస్తుతం ఫేజ్ 2లో ఒక మోటారు ద్వారా మాత్రమే పంపింగ్ చేస్తున్నాం. గోదావరిలోకి నీరు చేరితే మరో కొన్ని మోటార్లు ఆన్ చేసి పంపింగ్ చేస్తాం. బ్యారేజీ దిగువన గోదావరికి ఉన్న మిషన్ భగీరథ పంపింగ్ కొనసాగించడం కోసం బ్యారేజీలో ఒక గేటును ఎత్తి నీటిని వదులుతున్నాం.

– శరత్ బాబు, దేవాదుల డీఈఈ

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాల శిక్షకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

● వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిబిరాలను చిన్నారులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. వరంగల్ ఓసిటీ స్టేడియంలో ఉచిత వేసవి క్రీడా శిబిరాలను కలెక్టర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. జూన్ 6 వరకు జరిగే వివిధ క్రీడాంశాల్లో కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. జిల్లాలోని 10 గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓ సిటీ స్టేడియంలో ఖోఖో, క్రికెట్, జూడోలో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. వేసవి సెలవులను ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అర్బన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల శిక్షకులకు కలెక్టర్ క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీవైఎస్‌ఓ సత్యవాణి, తహసీల్దార్ ఇక్బాల్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాశ్‌యాదవ్, ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ పరంజ్యోతి, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ బోర్డు కన్వీనర్ దిలీప్, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సంజీవ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ఓసిటీ వాకర్స్ పాల్గొన్నారు.

క్రీడాశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 5 నుంచి 20 వరకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో వేసవి శిబిరాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లాలోని 50 పాఠశాలలు సిద్ధంగా ఉన్నాయని, ప్రతి శిబిరంలో 100 మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. శిబిరాల్లో యోగా, మెడిటేషన్, వాలీబాల్, కబడ్డీ, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, టెన్నిస్, క్రికెట్, చిత్రలేఖనం, సంగీతం తదితర అంశాల్లోలో శిక్షణ ఉంటుందని ఆమె వివరించారు. డీఆర్వో విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ అంకిత్‌కుమార్‌తో కలిసి గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్లపై చిన్న చిన్న గుంతలు పూడ్చి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, హైవేల్లో స్పీడ్ కంట్రోల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇరువైపులా బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డీఓ ఉమారాణి, ఏసీపీలు, అధికారులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఇస్తే ఉద్యోగం నీకే..!

- వాట్సాప్ కాల్‌లో బేరసారాలు
- డీఎంహెచ్ కార్యాలయ ఉద్యోగిగా పరిచయం



ఫిర్యాదు చేసిన ప్రేమ్ కుమార్

జనగామ: హలో.. వైద్యారోగ్య శాఖ లో ఉద్యోగం కావాలా..? రూ.లక్ష పట్టుకు రా.. బాధ్యత నాది అంటూ ఓ వ్యక్తి.. డీఎంహెచ్‌ఓ కార్యాలయం అధికారిగా చెబుతూ ఓ నిరుద్యోగికి వాట్సాప్ కాల్ చేసి బేరసారాలు సాగించిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు చిల్పూరు మండలం కృష్ణాజీగూడేనికి చెందిన మారపాక ప్రేమ్‌కుమార్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్) పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో గత నెల 26, 27వ తేదీల్లో ఓ వ్యక్తి నుంచి రెండుసార్లు వాట్సాప్ కాల్ రాగా.. ప్రేమ్‌కుమార్ లిఫ్టు చేయలేకపోయాడు. మరోసారి కాల్ రాగా.. లిఫ్టు చేయడంతోనే ఎస్‌టీఎస్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా.. అంటూ ప్రేమ్ కుమార్ వివరాలను పూర్తిగా చెప్పాడు. ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ముట్టజెబితే ఆ పోస్టు నీకే వస్తుందని నమ్మబలకడంతో అంత స్తోమత తనకు లేదని నిరాకరించారు. చివరగా వచ్చిన మెరిట్ లిస్టులో తన పేరు 6వ స్థానంలో ఉండగా, జాబితాలో అవకాశం రాకపోవడంతో నిరాశకు లోనయ్యాడు. ఉద్యోగ నియామక ప్రక్రియలో 1 నుంచి 11 స్థానాల వరకు అర్హత కలిగిన నిరుద్యోగులు ఉన్నప్పటికీ, ఆ పైన ఉన్న నంబర్ వ్యక్తిని సెలెక్టు చేయడంపై బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. కొంతమంది వ్యక్తులు అడ్డదారిలో సెలక్ట్ చేస్తున్నారని, దాంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై కలెక్టర్ విచారణ చేయించాలని ప్రేమ్ కుమార్ డిమాండ్ చేస్తున్నాడు. ఫోన్‌లో డబ్బుల డిమాండ్, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తనకు అనుమానం ఉందని పేర్కొంటూ ప్రేమ్‌కుమార్ కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగ మెరిట్ జాబితాపై అభ్యంతరాలను తెలిపేందుకు ఈ నెల 1వ తేదీ(గురువారం) వరకు అవకాశం ఇచ్చామని, ప్రస్తుతం ఫిర్యాదు చేసిన వ్యక్తి అభ్యంతరం తెలుపుతూ ఎలాంటి దరఖాస్తు ఇవ్వలేదని తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు అర్హత ఉంటే ఉద్యోగం వస్తుందని, తమ కార్యాలయం నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే విచారణ జరిపిస్తామన్నారు. ఎవరి ఫోన్, ఎక్కడ నుంచి వచ్చిందనే దానిపై సైతం ఆరా తీస్తామని తెలిపారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

- పట్టించుకోని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- సీజేఎల్ఎంలకు దక్కని ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులు ఇచ్చినా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విద్యుత్ కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 7,114 ఉద్యోగాల భర్తీకి 2006, జూన్ 8న ఒకసారి.. 2006 అక్టోబర్ 20న మరోసారి నోటిఫికేషన్ విడుదలైంది. పలువురు పరీక్షకు హాజరై ఉద్యోగానికి అర్హత సాధించారు. ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్‌తో మొదటి సారి 2007లో దాదాపు 1,564 మందిని కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లుగా, కోర్టుకు వెళ్లిన తర్వాత 2011లో దాదాపు 875 మందిని నియమించారు. నియామక ప్రక్రియలో కేవలం వయస్సును మాత్రమే ప్రామాణికంగా తీసుకుని భర్తీ చేపట్టడంతో అప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో సబ్ స్టేషన్ ఆపరేటర్లుగా, ఇతర ఉద్యోగాలు చాలా రోజులుగా చేస్తున్న వారు నష్టపోయారు. దీంతో నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మెరిట్‌ను పరిగణలోకి తీసుకోలేదని, నోటిఫికేషన్ ముందు కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఎక్కువ పనిదినాలు నిర్వహించి, ఇంటర్వ్యూలో అర్హత సాధించిన తమను ఉద్యోగానికి ఎంపిక చేయలేదని అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ద్విసభ్య ధర్మాసనం 2009 నవంబర్ 10న అర్హత కలిగి ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు క్లాజ్–6 (4)(సీ) ప్రకారం 2007, 2011లో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాన్ని ఆదేశించింది. కోర్టు తీర్పు మేరకు 2011 ఆగస్టు 2న ఉద్యోగాలు ఇచ్చిన వీరికి సర్వీస్ బెనిఫిట్స్ మాత్రం కల్పించలేదు. దీంతో కోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా అమలు చేయలేదని ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని తీర్పు ఇచ్చారు. అప్పటి ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కార్తికేయ మిశ్రా నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు సీనియారిటీ జాబితా తయారు చేయాలని మెమో జారీ చేశారు. 2007, 2011లో నియామకమైన అభ్యర్థులందరితో సీనియారిటీ జాబితాను రూపొందించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసినప్పుడు తక్కువ పనిదినాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయగా వారు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు 2019 ఫిబ్రవరి 25న తీర్పు ఇస్తూ 2009లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించగా, అభ్యర్థులు ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి వినతి పత్రం అందించారు. నాటి నుంచి నేటి వరకు సీఎండీలు మారుతున్న తమకు మాత్రం న్యాయం జరుగడం లేదని 2011లో ఉద్యోగాలు పొందిన సీజేఎల్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు 2011 నుంచి జీతం ఇవ్వాల్సి ఉండగా 2016 నుంచి మాత్రమే జీతం చెల్లిస్తున్నారని తెలిపారు. ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మ్యాన్ డేస్ (పని దినాలు)ను కాకుండా పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవడంతో మ్యాన్‌డేస్ ఎక్కువగా ఉన్న వారు సీనియారిటీని కోల్పోతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

భద్రకాళి దేవాలయంలో ఎదుర్కోలు ఉత్సవం

- మకర, చంద్రప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు
- నేడు భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవం



మకరవాహనంపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడోరోజు భద్రకాళిభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి.. అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని మకరవాహనంపై ఊరేగించారు. సేవాకార్యక్రమాలకు వరంగల్ ఆర్యవైశ్య సంఘం దాతలుగా వ్యవహరించారు. మహిళలు కుంకుమపూజలు, లలితాసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్‌రావు, ప్రోగ్రాం కన్వీనర్ తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, అయితా గోపినాథ్, అల్లాడి వీరభద్రయ్య, గుండా హైమావతి, శ్రీరాం శైలజ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 7గంటలకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. అమ్మవారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. సంస్కృత పండితులు దోర్బల ప్రభాకరశర్మ, గోరుగస్తు భాస్కర వెంకటసుబ్రహ్మణ్యశర్మ శివకల్యాణ రాయభారం ఘట్టాన్ని వివరించారు.నేడు(శుక్రవారం) సాయంత్రం నిర్వహించే భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని, పాల్గొనే వారు రూ.516 చెల్లించాలని తెలిపారు. వారికి కల్యాణోత్సవ తలంబ్రాలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేయనున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

భద్రకాళి కల్యాణబ్రహోత్సవాల పూజాకార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. వారి వెంట కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడికతీత, మాడవీధులు, దేవాలయం నుంచి కాపువాడ వరకు గల భద్రకాళి చెరువు కట్టను బలోపేతం చేస్తూ చుట్టూ గుట్టలను, చెరువు, పచ్చదనం సంతరించుకునేలా ఆలయప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కుడా అధికారులను కోరారు.

‘అప్పుల వసూలుకు వేధించొద్దు’

వరంగల్ లీగల్: ఇచ్చిన అప్పులు వసూలు చేసుకోవడానికి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు వేధించొద్దని, లబ్ధిదారుల రోజువారీ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకూడదని హనుమకొండ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సిరిసిల్ల ప్రియాంక గురువారం ఆదేశాలు జారీ చేశారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన బచ్చలపూరి సురేష్.. జేఎం హోంలోన్స్ ఇక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిమిటెడ్, కోటక్ మహేంద్ర బ్యాంకులనుంచి ఇంటి రుణం, వ్యక్తిగత అప్పు, క్రెడిట్ కార్డు రుణాలు తీసుకున్నారు. వీటిని వసూలు చేసేందుకు సంబంధిత ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల రికవరీ ఏజెంట్లు.. సురేష్ కుటుంబ సభ్యులను దుర్భాషలు ఆడుతూ చుట్టుపక్కల వారి సమక్షంలో అవమానాలకు గురిచేశారు. ఇంట్లో ఉండే పిల్లలు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న విధానాలకు కలత చెందిన సురేష్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన కోర్టు ఈనెల 9వ తేదీ వరకు సురేష్ పని ప్రదేశాల్లో, రోజువారీ కార్యకలాపాల్లో ఎలాంటి జోక్యాలు చేసుకోకూడదని, ప్రతి వాదులైన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

రైతులు ఇబ్బందులుంటే ఫోన్ చేయండి

● టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

హన్మకొండ: ధాన్యం కొనుగోళ్లు, కొనుగోళు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులున్నా, సమస్యలు, సలహాలు, సూచనల కోసం రైతులు టోల్ ఫ్రీ నంబర్ 180 0 4250 0333కు ఫోన్ చేయాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అదనపు తాలు, తూకం పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, రాత్రి వేళ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మామిడికాయలు కోస్తుండగా విద్యుత్ షాక్..

- కుడా జూనియర్ అసిస్టెంట్ మృతి
- దేశాయిపల్లిలో విషాదఛాయలు



అంకేశ్వరపు చంద్రమౌళి(ఫైల్)

దుగ్గొండి: పచ్చడి మామిడి కాయలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన అంకేశ్వరపు చంద్రమౌళి(40) గతంలో వీఆర్‌ఓగా పనిచేశాడు. ప్రస్తుతం కుడా పరిధిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 29న తన బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా స్వగ్రామం దేశాయిపల్లికి వచ్చాడు. తిరిగి విధులు నిర్వర్తించే ప్రాంతానికి వెళ్లేముందు ఓ కర్రకు చివరన ఇనుప కొడవలి కట్టి తమ ఇంటి ఆవరణలోని మామిడి కాయలు కోస్తున్నాడు. ఈక్రమంలో చెట్టుపై నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు కొడవలి తగిలింది. కర్ర పచ్చిగా ఉండడంతో విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. చంద్రమౌళికి భార్య దేవేంద్ర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి అంకేశ్వరపు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి

● ఇంటర్‌బోర్డు అధికారి యాదగిరి

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు ఆదేశాలమేరకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిని వినియోగించుకోవాలని ఇంటర్ బోర్డు అధికారి యాదగిరి కోరారు. గురువారం వరంగల్ జిల్లాలోని రంగశాయిపేట, నర్సంపేట, గీసుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. ఫెయిలైన విద్యార్థులకు తగినవిధంగా విద్యా బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్, ప్రిన్సిపాళ్లు సంపత్, సంపత్‌కుమార్, రమణాకర్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపండి



సీపీతో పదవీ విరమణ పొందిన అధికారులు

● సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: పోలీస్ అధికారులు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేసి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను గురువారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్సైలు యుగేందర్, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారావు, ఎలిషా, ఏఎస్సై కుమారస్వామి, హెడ్‌కానిస్టేబుల్ రాంరెడ్డిలు ఉన్నారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘంగా కాలంగా పోలీస్ శాఖకు అందించిన సేవలు మరిచిపోమని తెలిపారు. భవిష్యత్‌లో శాఖాపరమైన సహాయసహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి,సురేష్‌కుమార్, ఏసీపీలు సురేంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్‌రాజ్, సతీష్, శ్రీధర్, ఏఓ రామకృష్ణస్వామి, ఆర్ఎస్సై శ్రవణ్‌కుమార్ ఉన్నారు.